# ఆమని నవ్వింది

- సోమంచి ఉషారాణి

"ఆమని నవ్విందిరా!"

"ఆ మనీ ఉంటే ఆమనే ఏమిటి ఈమని కూడా నవ్వుతుంది."

"ఈమని ఎవరూ? అయినా నువ్వు అన్నిటికీ డబ్బుతో లంకె పెడతావు."

"మనీ పవరు అలాంటిది శిష్యా!"

"శిష్యానా? నువ్వు నా గురువు ఎప్పుడయ్యావు?"

"ఏదో వయసులో నీకంటే పెద్దవాణ్ణని అలా అన్నాను."

"అంత డబ్బున్నా ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న దానిలా, దిగులుగా..."

'దిగులు కాదది పొగరు"

"ఛ! నువ్వెప్పుడూ నెగటివ్‌గానే ఆలోచిస్తావెందుకు?"

"ఈ సత్యం" ఎప్పుడూ సత్యాలే చెబుతాడు.

అందుకే 'ఏ' ప్రక్క చుక్క తీసేసి అందరూ నిన్ను 'అసత్యం' అని పిలుస్తారు"

"జోకా?" సత్యం సీరియస్‌గా అంటుంటే సాగర్ గలగలా నవ్వాడు.

"ఆమని నవ్విందో లేదో గానీ నువ్వలా నవ్వుతుంటే నాకు నిజంగా ఆనందంగా ఉంది రా! నువ్వెప్పుడూ ఇలాగే..."

"ఒరేయ్ సాగర్! నిన్ను 'మేథ్స్' సార్ రమ్మంటున్నారు!" సుధాకర్ చెప్పేసి వెళ్ళిపోయాడు.

ఇంటికి బయులుదేరిన సాగర్, సత్యం స్టాఫ్‌రూమ్‌వైపు నడిచారు. అక్కడ 'మేథ్స్' సార్ చాలా సీరియస్‌గా ఉన్నారు.

"సాగర్! నీ పద్ధతి నాకేం నచ్చలేదయ్యా! సమ్ కరక్ట్‌గానే చేసి కూడా ఎందుకు కొట్టేశావు?"

సాగర్ సమాధానం చెప్పకుండా తలవంచుకున్నాడు. సత్యానికి ఆమని ఎందుకు నవ్విందో అప్పటికి అర్థమైంది. ఆమని ఆనందం కోసం వీడు కావాలనే ఒక లెక్క కొట్టేసి, ఆమెకు ఫస్టుమార్కు రావడం క్రెడిట్‌గా భావిస్తున్నాడంటే ఇది అంత అల్లాటప్పాగా కొట్టి పారేసే వ్యవహారంలా కనిపించడం లేదనుకున్నాడు.

"వాట్ సాగర్, మాట్లాడవేం?" రెట్టించారు 'మేథ్స్' సార్

"అదీ... అదీ... ఏదో పొరపాటున... "

"పొరపాటో, గ్రహపాటో అలవాటు మాత్రం కాకుండా చూసుకో! నాకిలాంటివి నచ్చవు" సీరియస్‌గా అన్నారాయన.

"సరే సార్!" అని 'అమ్మయ్య!' అని ఊపిరిపీల్చుకున్నాడు సాగర్. ఆ సమ్‌కి కూడా ఎక్కడ మార్కులిస్తానంటాడోనని కంగారుపడ్డాడు.

"ఈసారి చేసి కొట్టేయకుండా. అసలు చెయ్యడమే మానేస్తావు. ఏరా అంతేనా?" బయటకు వస్తుండగా అన్నాడు సత్యం.

సాగర్ నవ్వి ఊరుకున్నాడు కానీ సమాధానం చెప్పలేదు. ఆమని నవ్వడం కోసం సమ్ కొట్టేయడమేమిటి? అవసరమైతే సమస్తం అర్పిస్తాడు. ఆఖరికి తన ప్రాణాలైనా సరే! అదేనేమో ప్రేమమైకం అంటే!

ఆమనికి చాలా సంతోషంగా ఉంది. జీవితంలో ఒక్కసారైనా ఆ సాగర్ కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే ఆమె చిరకాల వాంఛ నెరవేరినందుకు పట్టలేని ఆనందంగా ఉంది.

ఆమని ఆనందం చూసి అర్చన వేదాంతిలా నవ్వింది. ఆమనికి ఉక్రోషం వచ్చింది. "నేను సాగర్‌ని ఓడిస్తే నీకెందుకే అసూయ?" బుంగమూతి పెట్టింది. ఆమె ఆనందాన్ని కాదనలేక ఏమీ సమాధానం చెప్పలేదు అర్చన.

"చెప్పవే! చెబితే గానీ నిన్ను వెళ్ళనీయను" అంది ఉక్రోషంగా.

"ఆమనీ ! ఎప్పుడూ సెంట్ పర్సంట్ మార్కులు తెచ్చుకునే సాగర్‌కి ఈసారి తక్కువ మార్కులు ఎందుకు వచ్చాయి?"

"దాందేముంది? లెక్క తప్పు చేయచ్చుగా!"

"ఊహు నేను నమ్మను. అతడు కావాలనే తప్పయినా చేసుండాలి. అసలు చేయకుండా వదిలేసి ఉండాలి."

"ఎందుకు?" ఆశ్చర్యపోయింది ఆమని.

"అతనికి నీ మీద ఉన్న ప్రేమ!"

"నాన్సెన్స్! అతనికీ, నాకూ ప్రేమేమింటి? మేమిద్దరం ఒక్కసారి కూడా మాట్లాడుకోలేదు. అసలు పరిచయమే లేదు."

"హు అతనిది వన్‌వే ట్రాఫిక్ ప్రేమ మరీ. అంతెందుకు ఒకసారి అతని ఆన్సర్‌షీట్ మేథ్స్ సార్‌ని అడిగి చూస్తే తెలిసిపోతుందిగా!"

"సరే! పద" ఇద్దరూ స్టాఫ్‌రూమ్‌కి వెళ్ళేసరికి మేథ్స్ సార్ పేపర్లన్నీ సర్దేసి కప్‌బోర్డు లాక్ చేస్తున్నారు.

"సార్!"

ఇద్దరమ్మాయిల్నీ ఆశ్చర్యంగా చూశారాయన.

ఏమైనా డౌట్సా?

"కాదు సార్! ఒక్కసారి సాగర్ ఆన్సర్‌షీట్ ఇస్తే చూసిచ్చేస్తాం" అర్చనే ధైర్యంగా అడిగింది. అలా అడగడం తప్పని ఆమెకు తెలుసు.

"అలా ఒకరి ఆన్సర్ పేపర్లు ఒకరికి ఇవ్వకూడదు. మీకేమైనా సందేహాలుంటే నన్ను అడగండి" సీరియస్‌గా అన్నారాయన.

ఇద్దరూ ఏమీ అనలేక దిగులుగా నిలబడేసరికి "సాగర్ అన్నీ కరెక్ట్ చేశాడు. కానీ ఒక సమ్ కొట్టేశాడు. ఎందుకిలా చేశావంటే ఏమీ మాట్లాడడు. 'సరేలే వాడి ఖర్మ!' అని వదిలేశాను," అని వెళ్ళిపోయాడాయన. వాళ్ళకి కావలసింది కూడా ఆ సమాధానమే!

అమని బాధపడుతుంటే 'చూశావా?' నేను చెప్పింది కరక్టయింది' అన్నట్లు చూసింది అర్చన.

ఇద్దరూ ఇంటికి బయలుదేరారు. అమనికి మాత్రం సాగర్ ఎందుకిలా చేశాడో అర్థం కాలేదు. తనంటే ఇష్టమైతే సూటిగా చెప్పవచ్చు కదా! చెప్పడానికి భయమైతే ప్రేమించడమెందుకు? పిరికితనం ప్రేమకి అనర్హం! కావాలని చేసిన సమ్ కొట్టేసి మార్కులు తక్కువ తెచ్చుకున్న మాత్రాన తనని ప్రేమించేస్తాననుకున్నాడా? ఏమిటో అంతా ట్రాష్! ఈ టీనేజ్ ప్రేమల మీద తనకు నమ్మకం లేదు.

"అమనీ! ఏమిటి అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు? కొంపదీసి నువ్వు కూడా..." ప్రేమలో పడలేదు కదా! అన్నట్లు నవ్వింది అర్చన.

"పిచ్చిగా వాగకు! ఈ ప్రేమా, దోమా నాకు సరిపడవని నీకు తెలియదా? నా కోసం మార్కులు తక్కువ తెచ్చుకునో, రక్తంతో ప్రేమలేఖలు వ్రాసినంత మాత్రాన అది ప్రేమనుకోవడమంత మూర్ఖత్వం మరొటి లేదు. అయినా ఇంకా ఇప్పుడే కాలేజిలో అడుగుపెట్టాము. జీవితంలో చదువుకోవలసింది, నేర్చుకోవలసింది అనంతం. ఈ టీనేజి ప్రేమలన్నీ ఒట్టి ట్రాష్! నాకంటూ కొన్ని ఆశయాలున్నాయి. వాటి కోసం శ్రమించే పట్టుదలా ఉంది. మధ్యలో ఈ ప్రేమలూ, దోమలూ ఏమిటి! అలాంటి ఉద్దేశ్యం ఉంటే మొగ్గలోనే తుంచేయమని ఆ సాగర్‌కి చెప్పు!"

ఆ రోజు ఓ పెద్ద కంపెనీలో ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. ఆ కంపెనీ ఎం.డి. అయిన అమని ఆ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఆ లిస్టులో సాగర్ పేరు చూడగానే ఆమెకి ఒకనాటి సాగర్ గుర్తు వచ్చాడు. తన దెబ్బకి భయపడి ఎటో ఎగిరిపోయాడు గురుడు! నవ్వుకుంది అమని. కానీ ఎదురుగా ఆనాటి సాగరే నిలబడేసరికి ఒక్కక్షణం నివ్వెర పోయింది. 'నిజమా? భ్రమా?' అని గిల్లి చూసుకుంది.

అమనిని అక్కడ చూసిన సాగర్ కూడా షాక్ తిన్నా వెంటనే తేరుకుని, "గుడ్ మార్నింగ్ మేడమ్!" అన్నాడు నవ్వుతూ.

"నువ్వు... మీరు సాగర్..."

"అవును మేడమ్ ఆనాటి సాగర్‌నే! ఎందుకంత ఆశ్చర్యం? మీరన్న మాటలు అర్చన నాకు చెప్పింది. నేను ప్రేమ మైకంలోంచి బయట పడి నా కర్తవ్యాన్ని గుర్తు చేసుకోవడానికి దోహదపడిన మీకు నిజంగా కృతజ్ఞుడను. మా నాన్న గారు వ్యవసాయం చేసుకుంటూ నన్ను చదివించేవారు. పాము కాటుకు ఆయన మరణించడంతో చదువు మధ్యలోనే ఆపేసి వ్యవసాయమూ, కుటుంబ భారమూ మోయవలసి వచ్చింది. కానీ చదువు మీద ఉన్న ఆసక్తిని చంపుకోలేక వ్యవసాయం చేస్తూనే పరీక్షలకు కట్టి, కష్టపడి చదివి పి.జీ. చేశాను. ఇప్పుడు ఉద్యోగం కోసం ఇలా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నాను. సారీ! ఇంటర్వ్యూ కోసం వచ్చి..."

"మరి... మీరు ... పెళ్ళి... చేసుకోలేదా?"

"నేను ప్రేమించిన అమ్మాయి ఓ.కె. అనాలిగా!"

"ఓ.కే! ఇక..."

"ఏమిటీ

ఓ.కే. అన్నది ఇక ఇంటర్వ్యూ మొదలెడదామా అని"

"అంతేనా? సరే కానీండి.

" మీరు ఎన్నాళ్ళ నుండి ప్రేమలో పడ్డారు? ఎలా పడ్డారు?" కొంటెగా అడుగుతున్న అమనిని చూసి, "వ్హాట్" అంటూ ఎగిరి గంతేసిన సాగర్ అరుపు అది ఎ.సి. రూము కాబట్టి సరిపోయింది కాని లేకపోతే ఆఫీసంతా వినబడేదే! అతని అనురాగం, ఆనందం చూసి అమని నవ్వింది గలగలా! ○

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.